క్లుప్తంగా

వైభవంగా బంగారమ్మతల్లి పండగ



ఎడ్లబండి పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం : పెందుర్తి మండలం రాపురంలో బంగారమ్మతల్లి పండగ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపు కుంకుమ, చీరలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పండగని పురస్కరించుకుని ఉత్తమ పాడి రైతు అవార్డు గ్రహీత రెడ్డి అర్జున్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎడ్లబండి పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అజయ్‌రాజ్, పార్టీ నాయకులు అర్జున్‌రావు, శ్రీరాములు, కృష్ణ, చిన్నబాబు, హర్ష తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 43 మంది ఎంపిక



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సింహాచలం: పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 43 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. చెన్నైకు చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్ అకాడమీ ఆఫ్ టెక్నికల్ స్కిల్స్ నిర్వహించిన ఈ సెలక్షన్స్‌లో మొత్తం 51 మంది విద్యార్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించగా 43 మంది ఎంపికయ్యారు. మెకానికల్–ఆరుగురు, ఎలక్ట్రికల్–21 మంది, ఎలక్ట్రానిక్స్–16 మంది ఉపాధి పొందారు. వీరికి సంవత్సరానికి రూ.2 లక్షల ప్యాకేజీ ఉంటుంది. రాయల్ ఎన్‌ఫీల్డ్ అకాడమీ ప్రతినిధులు అరుణ్‌కుమార్, విక్టర్‌దేవ్, ప్లేస్‌మెంట్ అధికారి కె.వి.ఎస్. సుబ్రహ్మణ్యేశ్వరరావు ఈ కార్యక్రమంలో నిర్వహించారు.

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం నేడు



పైల సన్యాసిరాజు, జెడ్పీటీసీ, పరవాడ

పరవాడ: మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, అనకాపల్లి ఎంపీ బీశెట్టి వెంకటసత్యవతమ్మ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి శుక్రవారం ఉదయం 8.30 గంటలకు పరవాడ మండలం తానాం గ్రామంలో పర్యటించనున్నారని పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా తానాంలో ప్రభుత్వం రూ.2.05 కోట్లతో తలపెట్టిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని పేర్కొన్నారు. మైలాన్ పరిశ్రమ యాజమాన్యం రూ.1.15 కోట్ల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాలు భవన సముదాయాన్ని మంత్రి గుడివాడ ప్రారంభించనున్నారన్నారు. రూ.90 లక్షల వ్యయంతో నిర్మించనున్న మంచినీటి పథకానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రనవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె. రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సింహాచలేశుడికి ఘనంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న ఉప ప్రధానార్చకుడు, ఉద్యోగులు, భక్తులు



నిత్య కల్యాణంలో యజ్ఞోపవీతం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవలు గురువారం ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో అధిష్టింపజేసి, 108 స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకులు ఈ సేవ నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కమనీయంగా నిత్య కల్యాణం

అప్పన్నస్వామికి గురువారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిత్య కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మంపడంలోని వేంచింపజేసి, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

అభినందన సభ విజయవంతానికి పిలుపు



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు

సబ్బవరం: వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా పాలిశెట్టి సురేష్‌రాజ్ ప్రమాణ స్వీకారోత్సవం, అభినందన సభను విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరిపాక పంచాయతీ శివారు లగిశెట్టిపాలెంకు చెందిన పాలిశెట్టి సురేష్ రాజ్‌ను వైఎస్సార్‌సీపీ అధిష్టానం అనకాపల్లి జిల్లా యువజన విభాగం అధ్యక్షునిగా నియమించిందన్నారు. ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా 30న బహిరంగ సభ నిర్వహించనున్నామని తెలిపారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పాల్గొనే అవకాశం ఉందన్నారు. వీరితోపాటు అనకాపల్లి ఎంపీ బీశెట్టి సత్యవతి, మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి హాజరవుతారని తెలిపారు. సమావేశంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కోటాన రాము, పాలిశెట్టి సురేష్ రాజ్, కర్రిబాబు, బోకం రామునాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి, శరగడం రాము, వనం అచ్చెంనాయుడు, బొడ్డేటి మహాలక్ష్మి నాయుడు, బోను గంగునాయుడు, ఎన్పీ రాజు, కనకరాజు పాల్గొన్నారు.

మినీ గోకులాల పనుల పూర్తికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటరావు

సింహాచలం: పెందుర్తి మండలంలో గతంలో మంజూరైన మినీ గోకులాల పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వెంకటరావు సూచించారు. పశు సంవర్ధక శాఖ అధికారులతో గురువారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 58 మినీ గోకులాలు మంజూరు కాగా.. వాటిలో రెండు ప్రారంభం కాలేదని, మిగిలిన 56 మినీ గోకులాల పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వాటి స్థితిగతులు పరిశీలించి మే నెలాఖారులోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ మేరకు నిధులు కూడా మంజూరవుతాయని వెంకటరావు అధికారులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అధికారులు సుజాత, సుకన్య, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు

- ఏయూ తెలుగు విభాగ ప్రొఫెసర్ బూసి వెంకటస్వామి
- పిల్లలు రాసిన కళింగ జానపద కథలు' పుస్తకావిష్కరణ



సమన్వయ అధికారి రూపావతితో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బూసి వెంకటస్వామి తదితరులు

సబ్బవరం: పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంచుకుని అందులోని నైతిక విలువలను అలవరుచుకోవాలని ఏయూ తెలుగు విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బూసి వెంకటస్వామి సూచించారు. సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం జూనియర్ అధ్యాపకుడు బద్రి కూర్మారావు రచించిన 'పిల్లలు రాసిన కళింగ జానపద కథలు'పుస్తకావిష్కరణ కార్యక్రమం గురువారం జరిగింది. గురుకులం ప్రిన్సిపాల్ విజయకుమార్ ఆధ్వర్యంలో గురుకులం పాఠశాలల జిల్లా సమన్వయ అధికారి ఎస్.రూపావతితో కలిసి బూసి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికత బాగా విస్తరిస్తున్న ఈ ఆధునిక కాలంలో అమ్మమ్మ, తాతయ్యలు చెప్పిన కథలు విని తమ బాల్యాన్ని మలుచుకునే సంస్కృతి నానాటికీ కనుమరుగవుతుందన్నారు. బద్రి కూర్మారావు మరుగునపడిన కథలను వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేసి సఫలం కావడంపై బూసి ప్రశంసించారు. సెల్‌ఫోన్‌లు, టీవీలకు అతుక్కుపోతున్న పసి తనం ఈ కథలు చదివి వారిలోని ఆలోచన దృక్పథాన్ని పెంపొందించుకుని ఉత్తమ పౌరులుగా ఎదగడానికి ఈ పుస్తకం దోహదపడుతుందన్నారు.

అంబేడ్కర్ జాతీయ సేవా పురస్కారాలు అందజేత



పురస్కారం అందజేస్తున్న అతిథులు

సీతంపేట: దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ, విశాఖ రత్న కళా పరిషత్ సంయుక్తంగా స్థానిక పౌరగ్రంథాలయంలో వివిధ రంగాలలో నిష్ణాతులైన ప్రముఖులకు అంబేడ్కర్ జాతీయ సేవా పురస్కారాలు, ఎన్టీఆర్ స్మారక పురస్కారాలను ప్రదానం చేశారు. ముందుగా కార్యక్రమాన్ని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్‌మూర్తి, కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, చిత్ర దర్శకులు దివాకర్, వ్యాఖ్యాత రాజేంద్రప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్పొరేటర్ నాగేశ్వరరావు, నేత్ర వైద్యులు నగేష్‌రెడ్డి, ఆయుర్వేద డాక్టర్ కూరపాటి శ్యామ్‌దస్, గాయని మను పల్ల, జన సైనికుడు గుడివాడ రామకృష్ణలతోపాటు మరికొంత మందిని సత్కరించి పుర్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏ.భాస్కర్, హర్షవల్లి, బొమ్మిడి సత్యనారాయణ, సన్యాసిరావు, మోహన్‌రావు, చంద్రశేఖర్, రామకృష్ణ, చిన్నారావు, డాక్టర్ ఎం.వరప్రసాద్, అరుణకుమారి, మల్లిక, అడవిరాజు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పగిలి.. తాగునీరు వృథా



ఐటీఐ జంక్షన్‌లోని బీఆర్‌టీఎస్‌లో పగిలిన పైప్‌లైన్ నుంచి వృథాగా పోతున్న తాటిపూడి నీరు

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ కూడలి నుంచి ఇండస్ట్రియల్ ఎస్టేట్ వెళ్లే బీఆర్‌టీఎస్ సబ్‌వే రహదారిలో గురువారం రాత్రి తాటిపూడి పైప్‌లైన్ పగిలిపోవడంతో మంచినీరు వృథాగా పోతోంది. లీకేజీ నుంచి భారీగా నీరు ప్రవహించడంతో భవానీగార్డెన్, సుంకరపేట సమీప కాలనీలు, రోడ్లు, డ్రైనేజీలు నీట మునిగాయి. బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారిలో అడుగులోతు నీరు ప్రవహించడంతో అటుగా వెళ్లే పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మరింత మెరుగ్గా ఏయూ గ్రంథాలయ సేవలు

- వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- నూతన సాఫ్ట్‌వేర్ సోల్ 3.0 ప్రారంభం



సోల్ 3.0ని ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని డాక్టర్ వీఎస్ కృష్ణ గ్రంథాలయ సేవలు మరింత సరళతరం, సులభతరం చేయడం లక్ష్యంగా పని చేస్తున్నామని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. గురువారం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో గ్రంథాలయంలో వినియోగానికి నూతనంగా అందుబాటులోకి వచ్చిన సోల్ 3.0 వెర్షన్ సాఫ్ట్‌వేర్‌ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు, పరిశోధకులకు, ఆచార్యులకు మరింత ఉపయుక్తంగా గ్రంథాలయ సేవలు ఉండే విధంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. యూజర్ ఫ్రెండ్లీగా గ్రంథాలయం మార్పు చేయాలన్నారు. రానున్న రెండు నెలల్లో గ్రంథాలయాన్ని పూర్తిస్థాయిలో ఆధునికీకరించి, మెరుగైన సేవలు అందించే దిశగా సిద్ధం చేస్తామన్నారు. తాళపత్రాల డిజిటలైజేషన్, శోధ్‌గంగలో 8వ స్థానం సాధించడం వర్సిటీ ప్రతిష్టను జాతీయ స్థాయిలో పెంచాయన్నారు. ఇందుకు కృషి చేసిన గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు, ఇతర సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. చరిత్ర, ఆర్కియాలజీ విభాగాలలో ఉన్న మరికొన్ని తాళపత్రాలను సైతం గ్రంథాలయం తీసుకుని డిజిటలైజేషన్ చేయాలని సూచించారు. గ్రంథాలయానికి 100 కొత్త కంప్యూటర్లను సైతం అందిస్తామన్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌లను అందించిన ఘనత ఏయూ గ్రంథాలయానికి ఉందని, తిరిగి అటువంటి వ్యక్తులను తయారు చేసే దిశగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు, అకడమిక్ డీన్ ఆచార్య కిషోర్‌బాబు, ప్రిన్సిపాళ్లు ఆచార్య జి.శశిభూషణరావు, టి.శోభశ్రీ, వి.వి జయలక్ష్మి, ఎస్.కె.భట్టి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌తో ఉన్నత ఉపాధి అవకాశాలు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జీవీవీ సత్యనారాయణమూర్తి

మురళీనగర్: పాలిటెక్నిక్ విద్యతో ఉన్నత ఉపాధి అవకాశాలు పొందవచ్చని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్, పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ జీవీవీ సత్యనారాయణమూర్తి అన్నారు. కాలేజీలో నిర్వహిస్తున్న పాలిసెట్ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిసెట్‌కు దరఖాస్తు గడువు ఈనెల 30తో ముగిస్తున్నందున్న అందరూ దరఖాస్తు చేయాలని సూచించారు. పాలిటెక్నిక్ విద్య పూర్తి కాగానే క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొని మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలు పొందవచ్చన్నారు. తక్షణ ఉపాధికి పాలిటెక్నిక్‌ను మించిన మార్గం మరొకటి లేదన్నారు. తల్లిదండ్రులు కూడా పాలిటెక్నిక్ విద్యను వారి పిల్లలు అభ్యసించే విధంగా ప్రోత్సహించాలని కోరారు. కమిషనరు సి.నాగరాణి ఆదేశాల మేరకు ఉచిత కోచింగ్‌తోపాటు ఉచితంగా మెటీరియల్ ఇస్తామన్నారు. ఇంజినీరింగ్ చదివిన విద్యార్థుల కన్నా పాలిటెక్నిక్ విద్యార్థులకు కార్పొరేట్ కంపెనీలు ప్రాధాన్యతనిస్తున్నాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపల్ కేడీవీ నరసింహారావు, పాలిటెక్నిక్ కాలేజీ ప్రతినిధి ఎం.విశ్వనాథరెడ్డి, ప్రముఖ స్పోకెన్ ఇంగ్లిష్ ట్రైనర్ కె.చంద్రశేఖర్, జెట్లీ పాల్గొన్నారు.

నేటి నుంచి వెంకటాద్రిపై బ్రహ్మోత్సవాలు

30న స్వామివారి కల్యాణోత్సవం



సింహాచలం : పెందుర్తి వెంకటాద్రిపై కొలువుదీరిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు రామానుజమ్ తెలిపారు. ఐదు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాల వివరాలను ఆయన గురువారం వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం విష్వక్సేణపూజ, అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 29న ఉదయం ధ్వజారోహణం, హోమాలు, సాయంత్రం లక్ష తులసి పూజ, మల్లికా పుష్పాలతో వేంకటేశ్వరస్వామికి విశేష అర్చన ఉంటుందన్నారు. 30న సాయంత్రం స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. మే 1న సాయంత్రం తిరువీధి, రథోత్సవం, 2న ఉదయం చక్రస్నానం, సాయంత్రం శ్రీపుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, విశేష అర్చనలు, ఉంజల్‌సేవ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాల్లో భక్తులంతా పాల్గొని స్వామి ఆశీస్సులు పొందాలని కోరారు.

విద్యా సమాచారమ్

మరో చైర్ ప్రొఫెసర్ ఏర్పాటు



వి.ఎస్‌రాజును సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజనీరింగ్ పూర్వ విద్యార్థి, ఐఐటీ ఢిల్లీ పూర్వ సంచాలకుడు వి.ఎస్.రాజు గురువారం వర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో మర్యాద పూర్వకంగా కార్యాలయంలో భేటీ అయ్యారు. వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవాలను రెండు వారాల పాటు నిర్వహించడంపై ఆనందం వ్యక్తం చేశారు. తాను చదువుకున్న సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో మూడు సంవత్సరాల కాలానికి ఒక చైర్ ప్రొఫెసర్ ఏర్పాటు చేయాలని వీసీని రాజు కోరారు. విభాగంలో మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలల ఆధునికీకరణకు సహకారం అందిస్తానన్నారు. అనంతరం సివిల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులనుద్దేశించి ఆయన ప్రత్యేక ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సత్యనారాయణ రెడ్డి, డీఎస్‌టీ పూర్వ శాస్త్రవేత్త డాక్టర్ డి.ఆర్.ప్రసాదరాజు, ఆచార్య కె.రాజగోపాల్, వై.వి.రాజు తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై పోస్టర్ విడుదల



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆచార్య వినయ్‌కుమార్, ఆచార్య డి.వి.ఆర్.మూర్తి, తదితరులు

ఏయూ క్యాంపస్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు మద్దతు పలకండి అన్న నినాదంతో బాల వికాస్ ఫౌండేషన్ సంస్థ రూపొందించిన పోస్టర్‌ను గురువారం ఏయూ జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ సి.ఎం.వినయ్‌కుమార్, ఆచార్య డి.వి.ఆర్.మూర్తి, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు జర్నలిజం విభాగంలో విడుదల చేశారు. ఈ నెల 30న జాతీయ బాల కార్మిక దినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆచార్య వినయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యపడుతుందన్నారు. నరవ మాట్లాడుతూ నిర్బంధ విద్యా హక్కు చట్టం పూర్తి స్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 30న పాఠశాలలు, బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ పోస్టర్‌ను అతికిస్తామని ఆయన తెలిపారు.

పరీక్ష కేంద్రం తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూ ఎస్ఐబీ)లో జరుగుతున్న మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలను రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ గురువారం ఉదయం తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన వసతులపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలను నిర్వహించడంపై అధికారులను అభినందించారు. అనంతరం ఏయూ సిబ్‌లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని పరిశీలించి, అక్కడ ఉన్న పుస్తకాలను తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్ ఏడో డాక్టర్ సారాబంది, తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ అభివృద్ధిపై హర్షం



వీసీ ప్రసాదరెడ్డిని అభినందిస్తున్న ఆచార్య కట్టమణి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం(ఆంధ్రప్రదేశ్) ఉపకులపతి ఆచార్య టి.వి.కట్టమణి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఏయూ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఏయూలో గత నాలుగు సంవత్సరాలుగా జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వీసీ వివరించారు. ఏయూలో ప్రగతిపై కట్టమణి హర్షం వ్యక్తం చేశారు.

జ్యూట్ కార్మికుల బకాయిలపై చర్చలు వాయిదా



జాయింట్ లేబర్ కమిషనర్‌తో సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్ కార్మికుల బకాయిల విషయంలో నగరంలోని జాయింట్ లేబర్ కమిషనర్ సమక్షంలో గురువారం కార్మిక సంఘాలు, మిల్లు యాజమాన్యం మధ్య జరిగిన చర్చలు మే 2కు వాయిదా పడ్డాయి. ఈ సందర్భంగా జూమ్ మీటింగ్ ద్వారా మిల్లు యజమాని బజోరియా జాయింట్ లేబర్ కమిషనర్ రామారావుతో మాట్లాడారు. ఇప్పటి వరకు ఎంతమంది కార్మికులకు? ఎంత బకాయిలు చెల్లించారు? అప్రెంటీస్‌లకు చెల్లించాల్సిన బకాయిలు ఎంత? పీఎఫ్ బకాయిల జాబితా ఇవ్వాలని జేసీఎల్ అడిగారు. కార్మికులకు బకాయిల చెల్లింపులో భాగంగా పాస్ పుస్తకాలలో తేడాలు కనిపిస్తున్నాయన్నారు. ఈ జాబితా కూడా ఇవ్వాలని అడగ్గా రెండు రోజుల్లో ఇవ్వనున్నట్టు యజమాని తెలిపారు.

తనకు ఆరోగ్యం బాగాలేక సమావేశానికి హాజరుకాలేదని బజోరియా వివరణ ఇచ్చారు. ఫిక్సిడ్ డిపాజిట్లు, కార్మికుల బకాయిల సమస్య పరిష్కరించకపోతే షోకాజ్ నోటీస్ పంపిస్తానని జేసీఎల్ హెచ్చరించారు. సమావేశంలో కార్మిక సంఘాల ప్రతినిధులు చిల్ల గణేష్‌రెడ్డి, నరవ రామారావు, అల్లు బాబూరావు, బోర రామారావు, చిల్ల ఆదినారాయణరెడ్డి, తమ్మిన కూర్మారావు, సరగడ ఈశ్వరరావు, మునకాల ఆదినారాయణ రెడ్డి, దల్లి అప్పలరెడ్డి, చిలకా నరసింగరావు, కొల్లి ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.